ప్రజాశక్తి

శుక్రవారం 16 మే 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

బాబోయ్ ఎండలు...



● బెంబేలెత్తుతున్న ప్రజలు ● నిర్మానుష్యంగా రహదారులు ● కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి-విజయవాడ : ఎండలు మండుతున్నాయి. జనం గగ్గోలు పెడుతున్నారు. రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 37-39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడిచిన వారం పది రోజుల నుంచి ఎండల తీవ్రతకు జనం బెంబేలెత్తిపోతున్నారు. విజయవాడ నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎండల తీవ్రతకు జనం బెంబేలెత్తిపోతున్నారు. ఓవైపు తీవ్రమైన ఎండలు, అడపాదడపా విద్యుత్ కోతలతో ఇరుకైన ఇళ్లల్లో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా కాయకష్టం చేసే గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, పొలాల్లో మిర్చి, పత్తి కోతలకు వెళ్లే కార్మికులు, హమాలీ కార్మికులు, వీధి వ్యాపారులు తదితరులపై మండుతున్న ఎండలు ప్రతాపం చూపుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు వేడిగాలులు, ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం కనీసమైన ప్రత్యమ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. ప్రధానంగా భవన నిర్మాణ కార్మికులు, గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు ఎండల తీవ్రతను తట్టుకునే విధంగా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మంచినీటి సదుపాయం, నీడ తదితర ఏర్పాట్లు మచ్చుకైనా కనిపించడం లేదు. ఎండల్లోనే పని చేస్తున్నందున కొందరు కార్మికులు స్పృహతప్పి పడిపోతున్న పరిస్థితులు లేకపోలేదు. విజయవాడ మహాత్మాగాంధీ (ఎంజి)రోడ్డు, కారల్ మార్క్స్ రోడ్డు, బిఆర్‌టిఎస్ రోడ్డు, జిఎస్‌రాజు రోడ్డు, కృష్ణలంక హైవే, బెంజిసర్కిల్ ఫ్లైఓవర్, దుర్గగుడి ఫ్లైఓవర్, స్వాతిరోడ్డు తదితర ప్రధాన రహదారులన్నీ ఉదయం 11 గంటల నుంచే జనంలేక బోసిపోతున్నాయి. రాకపోకలు తగ్గిపోతూ మధ్యాహ్నం సమయమలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అప్పుడప్పుడు మబ్బులు పడుతున్నా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ద్విచక్రవాహనాలపై రోడ్లపై ప్రయాణించాలన్నా ఎండ తీవ్రతకు ఇబ్బందులుపడుతున్నారు. రోడ్లపై నడవాలన్నా సాహసంతో కూడుకున్న పనిగా తయారైంది. మండుతున్న ఎండలు, వేడి గాలులు, అధిక ఉష్ణోగ్రతలకు ప్రజలు తలనొప్పి, జ్వరం, వాంతులు, విరోచనాలు, ఇతర పలురకాల వ్యాధుల బారిన పడుతున్నారని నగరంలోని పలువురు డాక్టర్లు పేర్కొంటున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నా...మురుగు, లోపించిన పారిశుధ్యం కారణంగా దోమలు విపరీతంగా పెరిగిపోయి దోమకాటుతో ప్రజలు జ్వరపీడితులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. వేసవి కాలంలో లక్షలు వెచ్చించి, నగరంలోని ప్రధాన కూడళ్లలో 80కిపైగా చలివేంద్రాలు ఏర్పాటు చేశామని విఎంసి అధికారులు చెబుతున్నారు. అయితే వాటి నిర్వహణ అధ్వానంగా తయారైందని పాదచారులు చెబుతున్నారు. చలివేంద్రాల్లో కూలింగ్ వాటర్ క్యాన్లు ఏర్పాటు చేస్తున్నా...ప్రజలకు సరిపోయే రీతిలో రక్షిత మంచినీరు వాటిలో ఉండటం లేదనే విమర్శ వినిపిస్తోంది. పోలీసు కంట్రోల్ రూమ్ దగ్గర కానీ, కృష్ణలంక, పటమట, భవానీపురం, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో చలి వేంద్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అంతేగాక పాదచారులు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారికి ఎండ తీవ్రత నుంచి కొంత ఉపశమనం కోసం నగరవ్యాప్తంగా ప్రధాన సెంటర్లలో హైల్యాండ్స్‌లో వాటర్ ఫౌంటైన్లు, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా నగరంలో అక్కడక్కడ ఒకటి అర పనిచేస్తున్నాయి తప్ప మిగిలినవన్నీ అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కువ శాతం వాటర్ ఫౌంటైన్లు పని చేయక తుప్పుపట్టిపోతున్నాయి. వీటిని ఏర్పాటు చేసిన లక్ష్యం దెబ్బతింటోంది. మరోవైపు గురువారం సాయంత్రం 4.30 గంటల సమయంలో తేటిక పాటి వర్షంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.





బిసి వసతి గృహాల్లో మౌలిక వసతులు

● మంత్రి సవిత ● విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలో బీసీ విద్యార్థుల విద్య కోసం బలమైన పునాదులు వేయటం వల్లే నేడు పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన బీసీ హాస్టళ్లు, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత మాట్లాడుతూ బిసి సంక్షేమ వసతి గహాల్లో మరమ్మతులు చేపట్టి మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. బిసి హాస్టళ్లు, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధి చేస్తుందన్నారు. అన్ని హాస్టళ్లలో ఏపీఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు తీసుకుని భోజనం అందిస్తున్నామన్నారు. బీసీ యువతకు సివిల్ సర్వీసెస్, మెగా డీఎస్సీకి శిక్షణ అందిస్తున్నామన్నారు. విదేశీ విద్యా కూడా అందిస్తామన్నారు. ముందుగా జ్యోతిబా పూలే, దేశ రక్షణకు ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ చిత్ర పటాలకు మంత్రి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కారక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యన్నారాయణ, అడిషనల్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ (మిగతా 2లో)



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో మంత్రి సవిత



ర్యాలీపై చర్చిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

నేడు నగరంలో తిరంగా ర్యాలీ

హాజరుకానున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - విజయవాడ : పహల్గాం ఉగ్రదాడుల నేపథ్యంలో భారత్ సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని కీర్తిస్తూ శుక్రవారం విజయవాడలో ఐదు వేల మందితో చేపట్టనున్న తిరంగా ర్యాలీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిధిగా పాల్గొంటున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. తిరంగా ర్యాలీ నిర్వహణపై గురువారం కలెక్టరేట్ నుండి డాక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి తిరంగ ర్యాలీ బయలు దేరి బెంజ్‌సర్కిల్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు 500 మీటర్ల జాతీయ పతాకాన్ని చేతబూని ర్యాలీలో పాల్గొనేలా (మిగతా 2లో)

త్వరలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ?

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నాలుగేళ్ల నిరీక్షణకు త్వరలో తెర పడనుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కొండపల్లి గ్రామ పంచాయతీ నుండి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి నాలుగేళ్ల క్రితం ఎన్నికలు నిర్వహించినా ప్రత్యేక అధికారి పాలనలోనే కొండపల్లి మున్సిపాలిటీ కొనసాగుతోంది. దీంతో పాలన కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్ని చందంగా తయారైంది. వైసిపి, టిడిపిలకు సరిమానంగా సభ్యులు ఉండడంతో ఈ వ్యవహారం కోర్టుకు వెళ్లింది.



నగరంలో పర్యటిస్తున్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన గురువారం ఫిలిం కాలనీ, మొగల్రాజపురం, క్రీస్తు రాజపురం, ఎస్ఎల్‌వి నగర్, ఎంజీ రోడ్డు ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఫిలిం కాలనీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుపై ఆరా తీశారు. క్రీస్తురాజపురంలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అమత్ పథకంలో భాగంగా నిర్మించనున్న డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్‌కు స్థలాన్ని పరిశీలించారు. నగర అందాన్ని భంగం కలిగించే హోర్డింగ్‌లను, కన్స్ట్రక్షన్ అండ్ డెమోలేషన్ వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈపర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకష్ణ నాయక్, జాయింట్ డైరెక్టర్ అమత్ డాక్టర్ లతా, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) వెంకట నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, ఇఇలు శ్రీనివాస్, చంద్రశేఖర్, బయాలజిస్ట్ సూర్యకుమార్ పాల్గొన్నారు.

నేడు విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపు

విజయవాడ : 'ఆపరేషన్ సింధూర్' విజయోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ నగరంలో జరిగే తిరంగా ర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు పోలీసు కమిషనరేట్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 4 నుండి 8 గంటల వరకు ఎంజి రోడ్‌లో ఇందిరా గాంధి మున్సిపల్ స్టేడియం నుండి బెంజ్ సర్కిలు వరకు జరిగే ర్యాలీలో ప్రముఖులు పాల్గొంటున్న నేపథ్యంలో ఎంజి రోడ్‌లో బెంజిసర్కిల్ నుండి ఆర్‌టిసి వై జంక్షన్ వరకు, ఆర్‌టిసి వై జంక్షను నుండి బెంజ్ సర్కిల్ వరకు ఎటువంటి వాహనాలను అనుమతించరు. రామవరప్పాడు నుండి వారధి వైపు వెళ్లే వాహనాలు మహానాడు జంక్షన్ ఆటోనగర్ రోడ్డు, ఆటో నగర్ గేటు, పటమట ఎన్‌టిఆర్ సర్కిల్, కృష్ణవేణి రోడ్డు, రామలింగేస్వర నగర్, స్క్రూబ్రిడ్జి మీదుగా వారధి వైపు వెళ్లాలి. అలాగే వారధి నుండి రామవరప్పాడు వెళ్లే వాహనాలు అదే రూట్లో వెళ్లాలి. పెనమలూరు నుండి బెంజ్ సర్కిల్ వైపు వచ్చే వాహనాలు ఆటో నగర్ గేటు, ఆటో నగర్ రోడ్డు, మహానాడు జంక్షన్ వైపునకు మళ్లిస్తారు. పెనమలూరు నుండి వారధి వైపు వచ్చే వాహనాలు పటమట ఎన్‌టిఆర్ సర్కిల్, కష్ణవేణి రోడ్డు, రామలింగేస్వర నగర్, స్క్రూ బ్రిడ్జి, వారధి వైపు వెళ్లారు. అలాగే వారధి వైపునుండి పెనమలూరు వైపు వెళ్లే వాహనాలు అదే రూట్లో వెళ్లాలి. విశాఖపట్నం, ఏలూరు వైపునుండి వచ్చే ఆర్‌టిసి బస్సులు రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్, గుణదల చుట్టుగుంట, విజయ టాకీస్, హోటల్ స్వర్ణ పాలెస్ జంక్షన్, ఓల్డ్ పిసిఆర్ జంక్షన్, పిఎన్‌బిఎస్, అలాగే పిఎన్‌బిఎస్ నుండి ఏలూరు వైపు వెళ్లే బస్సులు అదే రూట్లో వెళ్లాలి. మచిలీపట్టణం, గుడివాడ నుండి వచ్చే బస్సులు తాడిగడప 100 అడుగుల రోడ్డు, ఎనికేపాడు, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్, గుణదల, చుట్టుగుంట, విజయ టాకీస్ హోటల్ స్వర్ణ పాలెస్ జంక్షన్, ఓల్డ్ పిసిఆర్ జంక్షన్, పిఎన్‌బిఎస్, అలాగే పిఎన్‌బిఎస్ నుండి మచిలీపట్టణం వెళ్లే బస్సులు అదే రూట్లో వెళ్లాలి. పిఎన్‌బిఎస్ నుండి బందర్ రోడ్డు మీదుగా బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే సిటీ బస్సులు ఓల్డ్ ఆర్‌టిసి వై జంక్షన్, హోటల్ స్వర్ణ పాలెస్ జంక్షన్, విజయ టాకీస్, చుట్టుగుంట, గుణదల, రామవరప్పాడు రింగ్ మహానాడు, ఆటోనగర్, ఆటోనగర్ గేటు బందర్ రోడ్డు మీదుగా వెళ్లాలి. అలాగే పెనమలూరు, ఆటో నగర్ నుండి పిఎన్‌బిఎస్‌కు వెళ్లే సిటీ బస్సులు అదే రూట్లో వెళ్లాలి.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎం.గంగాధర్ వారి కళాబందంతో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

భవానీద్వీపం, బెరంపార్క్ ప్రైవేటీకరణ విరమించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - భవానీపురం : భవానీ ద్వీపం, హరిత బెరం పార్క్ ప్రైవేటీకరణ చర్యలను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి కార్పొరేటర్ బోయి సత్యబాబు కోరారు. ఆయా ప్రాంతాల్లో గురువారం సిపిఎం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ ఏపీ టూరిజం డెవలప్మెంట్ సంస్థ విజయవాడ నగరంలో ఉన్న హరిత బెర్మ్ పార్క్ పున్నమి, భవాని ద్వీపం, రాష్ట్రంలో ఇతర పర్యాటక కేంద్రాల అభివద్ధి పేరుతో విలువైన బెర్మ్ పార్క్ 5.55 ఎకరాల భూమిని ఎస్‌బిఐలో తాకట్టు పెట్టి రూ.110 కోట్లు అప్పు పొందిందని పేర్కొన్నారను. దీని అభివద్ధిని ఏమాత్రం పట్టించుకోకుండా పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు ఆస్కారం కలిగించేలా వ్యవహారం సాగుతోందని పేర్కొన్నారు. వీటిపై విచారణ చేసి అవినీతి అక్రమాలను వెలికి తీసి అవినీతిపరులను శిక్షించాలని కోరారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పిపిపి పేరుతో స్టెర్లింగ్ అనే ప్రైవేట్ కంపెనీలకు రాష్ట్ర వ్యాప్తంగా విజయవాడతో సహా 14 పర్యాటక కేంద్రాలను కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భవాని ద్వీపాన్ని, ఇతర పర్యాటక ప్రాంతాలను ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ కమ్యూనిస్టులు చేసిన ఆందోళనల్లో ఆ పార్టీ మాజీ మంత్రి దేవినేని ఉమా, ఇతర నాయకులు పాల్గొన్న విషయాన్ని మర్చిపోవద్దని తెలిపారు. పిపిపి పేరుతో భవానీ ద్వీపం, నది హారతులు, విజయవాడ పర్యాటక కేంద్రాలను ప్రైవేటు పరం చేస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే టిడిపి కూటమి ప్రభుత్వానికి పడుతుందన్నారు. ఈ పర్యటనలో సిపిఎం పశ్చిమ నగర నాయకులు కె.సూరిబాబు, ఎస్.సుబ్బారెడ్డి, వి.సాములు బి.అచ్చేశ్వరరావు, ఎన్.చిన్న గురప్ప. ఎస్.కామరాజు, బి.ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల కేసులను త్వరగా పరిష్కరించండి

ఆర్‌డిఒలకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : నగరలోని కలెక్టరేట్ నుండి గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సీలింగ్ భూములపై తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై విజయవాడ, నందిగామ, తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏపి ల్యాండ్ రిఫార్మ్స్ (సిఓఎహెచ్) యాక్ట్, 1973 ప్రకారం సీలింగ్ భూములను స్వాధీనం చేసుకొని 22 ఏ నిషేదిత జాబితాలో పొందుపరచాలని ఆదేశించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న భూములకు ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ అవసరాల నిమిత్తం వినియోగించాలని ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డిఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజారోగ్యంపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలని విజయవాడ నగరపాలకు సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విఎంసి ప్రధాన కార్యాలయం నూతన భవనం మీటింగ్ హాల్‌లో గోరువారం ప్రజారోగ్య విభాగం అధికారులు, శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సెక్రెటరీలతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ సెక్రటరీలు ఫీల్డ్ విజిట్ చేసి వర్కర్ల హాజరును చూసుకోవాలని, మూడు నెలల కంటే ఎక్కువగా హాజరుకాని వర్కర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కాల్వల్లో ఎటువంటి వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ అన్నపూర్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సర్వేను పర్యవేక్షించిన కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో ఉన్న వీధి వ్యాపారస్తులను సర్వే చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీధి వ్యాపారస్తుల సర్వేలో ఆయన గురువారం పాల్గొన్నారు. వీధి వ్యాపారం చేస్తున్న మహిళతో సర్వేలో ఉన్న 45 అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి.వెంకటనారాయణ పాల్గొన్నారు.



బిసి వసతి గృహాల్లో మౌలిక వసతులు

(మొదటి పేజీ తరువాయి)

రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు, బీసీ సంక్షేమ హాస్టళ్ల నుంచి 200 మందికి బ్యాగులు, సర్టిఫికెట్లు, మెమొంటోలు అందించారు. ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు పొందిన 22 మందికి నగదు పురస్కారాలు అందించారు. వీరిలో 8 మంది బీసీ హాస్టళ్లకు చెందినవారు కాగా, 14 మంది ఎంజేపీ స్కూళ్లు, కళాశాలలకు చెందినవారున్నారు. ప్రథమ బహుమతి పొందిన 12 మందికి ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున, 7 మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున, ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున నగదు పురస్కారాలు అందించారు. ఈకార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ సంచాలకుల డాక్టర్ ఏ.మల్లిఖార్జున్, మహాత్మా జ్యోతీబా పూలే గురుకులాల సొసైటీ కార్యదర్శి పి.మాధవీలత, ఏ.కష్ణ మోహన్ పాల్గొన్నారు.

నేడు నగరంలో తిరంగా ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేయాలన్నారు. డిజె సౌండ్ సిస్టమ్ ద్వారా జాతీయ సమైక్యత, సమగ్రతను చాటేవిధంగా జాతీయ గీతాలను ఆలపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీతో పాటు ముఖ్య కూడళ్లలో తప్పెటగుళ్ళు, గరగర నత్యాలు, డప్పు వాయిద్యాలు, నత్య ప్రదర్శనలను ఏర్పాటు చేయాలన్నారు. ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ జాతీయ జెండాను అందించాలన్నారు. ఈ ర్యాలీ విజయవంతం చేసేందుకు నగర ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ ఎం.లక్ష్మీ నరసింహం, ఆర్‌డివో కానూరి చైతన్య, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



పెదపారుపూడిలో...


గుడివాడలో...


చల్లపల్లిలో...

సమ్మె జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: ఈ నెల 20న జరగనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. గురువారం కరపత్రాలను గ్రామంలోని వీధుల వెంట తిరుగుతూ పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివనాగేంద్రం మాట్లాడారు. రైతుల పండించిన పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలని, మినుమును బస్తాకు 9 వేల రూపాయల మద్దతు ధరకు కొనాలని, ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖమ్మం కొండల బాబు, సుబ్బారావు, అంబటి శ్రీను, బుల్లయ్య, జుజ్జువరపు యోసేపు, డేవిడ్ రాజు పాల్గొన్నారు. **బంటుమిల్లి:** ఈ నెల 20న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి శివశ్రీనివాసరావు కోరారు. సిఐటియు జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షమీం, జయంతి, లక్ష్మీ కుమారి, అజయ్‌ఘోష్ తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ:** ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాల్సిందిగా గుడివాడ ఆటోనగర్లో బొంతు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలనికోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సిపి రెడ్డి, గుడివాడ పట్టణ కమిటీ సభ్యులు సిహెచ్ శివ, ఆర్ కొండ, నాగరాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి:** కేంద్ర ప్రభుత్వ కార్మిక చట్టాలు ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని కుదేలు చేసేలా ఉన్నాయని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మత్రాపు పోలినాయుడు అన్నారు. ఈనెల 20న జరిగే కార్మికుల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గురువారం చల్లపల్లి మండలంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పట్టణ కేంద్రాల్లో విస్తరించి ఉన్న ఓలా, రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలు రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు అనుగుణంగా మండల కేంద్రాల్లో కూడా విస్తరించే ప్రమాదం ఉందన్నారు. ఈ నెల 17వ తేదీన చల్లపల్లి నుండి ఘంటసాల వైపుగా జరిగే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు చల్లపల్లి మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, చల్లపల్లి కార్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గంజాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని, జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, పెంచిన ఆర్టీవో త్రైమాసిక చలానా చార్జీలు తగ్గించాలని, లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని అవనిగడ్డలో సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు గురువారం ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ముత్రాపు పోలినాయుడు అవనిగడ్డలోని శ్రామిక ఆటో వర్కర్స్‌ను కలిసి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్‌వి శ్రీనివాసరావు, జి రాంబాబు, కాసులు, పి రాంబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు. **పామర్రు (పెదపారుపూడి):** ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా కౌలు రైతుల సంఘం నాయకులు టివి లక్ష్మణస్వామి పిలుపునిచ్చారు. గురువారం పెదపారుపూడిలో సిఐటియు కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి మాట్లాడుతూ కార్మిక సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని, రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలు, 600 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఒడుగు గంగాధర్ ప్రసాద్, సిఐటియు మండల కార్యదర్శి యు అనూష, పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు అబ్రహం తదితరులు పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో...



బంటుమిల్లిలో...

ఇన్చార్జి కలెక్టర్‌ను కలిసిన అమిత్‌గుప్తా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): క్షేత్రస్థాయిలో వివిధ ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అమలు అవుతున్నాయో, సేవలు ఎలా అందిస్తున్నారో , లబ్ధిదారులకు ఏ మేరకు అందుతున్నాయో అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి సమగ్ర బందాలను ఏర్పాటు చేసింది.ఈ నేపథ్యంలో సమగ్ర బంద సభ్యులు అమిత్ గుప్తా గురువారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మను కలెక్టరేట్ లోని వారి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బంద సభ్యులు గుప్త మాట్లాడుతూ తాము గ్రామ వార్డు సచివాలయ కార్యాలయాలు సందర్శించి అక్కడి ఉద్యోగులతో పాటు వారి పరిధిలోని లబ్ధిదారులతో ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్లు, దీపము పథకాలతో పాటు చౌక దుకాణం ద్వారా పంపిణీ అవుతున్న బియ్యం, నూనె తదితర నిత్యావసర సరుకుల సర్వీస్ డెలివరీ విధానంపై ముఖాముఖి వారితో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఇంచార్జ్ కలెక్టర్కు వివరించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ బందం సేకరించిన వివరాల నివేదికను తన పరిశీలన నిమిత్తం అందజేయాలని కోరారు. కన్సల్టెంట్ వెంట జిల్లా ప్రణాళిక విభాగం డిప్యూటీఎస్‌ఓ విశ్వనాథం పాల్గొన్నారు.



సకాలంలో సాగు నీరందించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నం నీటిపారుదల శాఖ కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులతో గురువారం సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, జిల్లా తెలుగురైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం నీటి పారుదల శాఖను నిర్వీర్యం చేసిందన్నారు. కనీసం గుర్రపు డెక్క ను కూడా తొలగించ లేదని, ఈ ప్రభుత్వం రాగానే గుర్రపు డెక్కలను తొలగించి రైతు కష్టసుఖాలను తెలుసుకునేందుకు నీటి సంఘాలను నియమించిందన్నారు. రాబోయే ఖరీఫ్ పంటకి సకాలంలో రైతులకు నీరు వచ్చేలా ప్రణాళికలు ఏర్పరుచుకుని నీటి సంఘ అధ్యక్షులు, అధికారులు సమన్వయంతో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవతో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పలు సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని కేసరపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మరుగు కలవాడు డ్రైనేజీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మురుగు కాలువ పూడికతీత చేపట్టినట్లు తెలిపారు. గన్నవరం మండలం కేసరపల్లి శివారు దుర్గాపురం లో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య వెంటాడుతుందని చెప్పారు. హెచ్ సి ఎల్ గోడను ఆనుకుని ఉన్న ప్రధాన డ్రైన్ పూడిక తీయకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు దుర్గపురం కాలనీ జలమయమయ్యేది. ఇటీవల గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో దుర్గాపురం వాసులు ఎమ్మెల్యే కలిసి తమ కాలనీలో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రధానంగా డ్రైనేజీ పూడిక తీయించి ముంపు నుండి రక్షించాలని వేడుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే డ్రైనేజీ పూడికి తీత పనులు చేపట్టాలని, పనులు పూర్తి చేసి తనకు ఫోటోలు పెట్టాలని గ్రామపంచాయతీ సిబ్బంది ని ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగి డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టి రెండు రోజులుగా శరవేగంగా పనులు చేస్తున్నట్లు చెప్పారు. సుదీర్ఘకాలంగా మరుగున పడిన మురుగునీటి సమస్యను ఎమ్మెల్యే దష్టికి తీసుకు వెళ్ళగానే స్పందించి సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కు దుర్గాపురం కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ సమస్య పూర్తిస్థాయి పరిష్కారం గా ఈ కచ్చా డ్రైన్ ను పక్కా డ్రైన్ గా నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నట్లు వివరించారు.



లోక్ సభ సబార్డినేట్ లేజిస్లేటివ్ కమిటీ చైర్మన్‌గా బాలశౌరి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

గత ప్రభుత్వ హయంలో నాలుగు సంవత్సరాలు లోక్ సభ సభార్దినేట్ లేజిస్లేటివ్ కమిటీ చైర్మన్ గా పదవీ భాద్యతలు నిర్వహించిన మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరికి, కూటమి ప్రభుత్వంలో మరోసారి కూడా చైర్మన్ పదవి వరించింది. లోక్ సభ కమిటీ చైర్మన్ గా ఎంతో సమర్ధవంతంగా పదవి బాధ్యతలు నిర్వహించి, అటు ఉన్నతాధికారులతోనూ, ఇటు కేంద్రం ప్రభుత్వంలోని పెద్దలతోను సత్సంభందాలు నెలకొల్పడంలో చూపించిన చాకచక్యం వారికీ మరోసారి ఈ చైర్మన్ పదవి దక్కేటట్లు చేసింది. గతంలో లోక్ సభ కమిటీ చైర్మన్ గా చాలా తక్కువ సమయంలో ఎక్కువ సమావేశాలు నిర్వహించిన ఘనత కూడా ఎంపి బాలశౌరి ఖాతాలో ఉండటం గమనార్హం. ఈ పదవీకాలంలో కుడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైనమేర శక్తివంచన లేకుండా పాటుపడతానని, కమిటీలోని అందరు గౌరవ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని, వారి యొక్క అనుభవాన్ని ఉపయోగించుకొని లోక్ సభ సబార్డినేట్ లేజిస్లేషన్ కమిటీ మరింత సమర్ధవంతంగా పనిచేయడానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు.

చెట్లను నరికితే ఉపేక్షించం : మండలి

ప్రజాశక్తి-మోపిదేవి: ఇష్టారాజ్యంగా వాల్టా చట్టం ఉల్లంఘించి రోడ్ల పక్కన చెట్లను ఎవరైనా నరికితే ఉపేక్షించేది లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం చల్లపల్లి, మోపిదేవి మండలాల పరిధిలోని పెద్దకళ్లేపల్లి రోడ్డులో దారి పొడవున పలు చోట్ల చెట్లను మట్టానికి నరికివేసిన తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. జాతీయ రహదారి-216 పక్కన మొక్కలు తగలబెట్టిన తీరు పరిశీలించారు. ఈ ఘటనలపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోడీ పదేళ్ల క్రితం ఇచ్చిన స్వచ్ఛ భారత్ పిలుపు అందుకుని నిర్విరామంగా స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి దంపతులు, వందలాది మంది స్వచ్ఛ కార్యకర్తలు ప్రతి రోజు తెల్లవారు ఝామునే లేచి రోడ్ల పక్కన చెట్లు నాటి, ట్యాంకర్లతో క్రమం తప్పకుండా నీరు పోసి వేలాది మొక్కలు పెంచుతున్నారని తెలిపారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రశంసలు అందుకుందన్నారు. వారు అందిస్తున్న స్ఫూర్తిని పట్టించుకోకుండా ఎవరికి వారు చెట్లను నరికితే సహించేది లేదన్నారు. ఒక మొక్క నాటి సంరక్షించి పెంచటం కష్టమని, అలాంటిది స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు వేలాది మొక్కలు నాటి పెంచటం గర్వకారణం అన్నారు. చెట్లను నరకటం ఉపేక్షించరాని నేరం అన్నారు. తహసీల్దార్ అనుమతి లేకుండా చెట్లు నరకకూడదని స్పష్టం చేశారు. అధికారులు ఉపేక్షిస్తే చెట్లు మిగలవు అన్నారు. నియోజకవర్గంలో అధికారులు ఖచ్చితంగా చట్టాన్ని పరిరక్షించి అమలు చేయాలని స్పష్టం చేశారు. చెట్ల సంరక్షణకు అధికారులతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో సీఎం పర్యటన రూట్ ఎటు ఉంటే అటు ఇష్టారాజ్యంగా చెట్లు నరికేశారని, అలాంటి పాలన వద్దని ప్రజలు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. ఇంకా అలాంటి ఆలోచనలు పాటిస్తే చర్యలు తప్పవన్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా అధికారులు వెంటనే ఇష్టారాజ్యంగా చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు నరికింది ఎంతటి వారినైనా సహించకుండా వాల్టా చట్టం అమలు చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చట్టాల అమలులో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీ.వనజాక్షి, ఎంపీడీఓ డాక్టర్ ఏ.వెంకటరమణ, స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సీఐ కే.ఈశ్వరరావు, ఎస్ఐ పీ.ఎస్.వీ సుబ్రహ్మణ్యం, వీఆర్‌ఓలు మత్తి గోపాలకష్ణ, అమలేశ్వరరావు పాల్గొన్నారు.


చెట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్



విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వినతిపత్రం ఇస్తున్న సత్యబాబు

సర్‌ఛార్జీల భారాలను రద్దు చేయాలి

సిపిఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యుత్ అదనపు లోడు, సర్‌ఛార్జీల భారాలు రద్దు చేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ఎపిఎస్‌పిడిసిఎల్ విజయవాడ కార్యాలయం వద్ద నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జడ్జి విక్టర్ ఇమ్మానుయేల్‌కు వినతిపత్రం అందజేసిన మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఛార్జీల ద్వారా వేల కోట్లు వినియోగదారుల జేబులు నుండి లూటీ చేసిందని మళ్లీ అదనపు లోడు పేరుతో సర్‌ఛార్జీల పేరుతో వేలాది రూపాయలు సామాన్య మధ్యతరగతి ప్రజల నుండి బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. నివాస ప్రాంతాలపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించి ఆ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో జోడు బొమ్మలు సందు, రావిచెట్టు రోడ్డు, జెండా చెట్టు వద్ద పరమాల వెంకటేశ్వరరావు లంకే నాగరాజు ఇంటి వద్ద ఈ విద్యుత్ వైర్లు ఇళ్లపై ఉన్నాయని వాటిని వెంటనే తొలగించి వారికి రక్షణ కల్పించాలని కోరారు. పేదలున్న ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు లేవని, వెంటనే ఏర్పాటు చేసి చీకటి ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.సాంబశివరావు ఎన్.చిన్న గురప్ప. కామరాజు ఎస్.బి.ఎలా రావు. ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జకీయా బిజెపిలో చేరడం నమ్మక ద్రోహమే

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకీయా ఖానం బీజేపీలో చేరి ముస్లిం సమాజానికి నమ్మక ద్రోహం చేశారని జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ పఠాన్ హఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్ మండిపడ్డారు. గురువారం జగ్గయ్యపేట పట్టణంలోని వైయస్ఆర్ సిపి నియోజకవర్గ కార్యాలయంలో వారు ముస్లిం నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా వైస్ ఛైర్మన్ పఠాన్ హఫీజున్నిసా మాట్లాడుతూ భర్త చనిపోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న జకీయా ఖానంను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకొని రాజకీయ భవిష్యత్ ఇచ్చిందన్నారు. ఆమెను ఉన్నత పదవిలో కూర్చోబెట్టి, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, జగ్గయ్యపేట పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ మునిరా తదితరులు పాల్గొన్నారు.

పిఎం కిసాన్ లబ్ధిదారులు వెరిఫికేషన్ చేయించాలి

ప్రజాశక్తి - తిరువూరు : అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందే రైతులు మే 20వ తేదీలోగా రైతు సేవా కేంద్రాల్లో వన్ బి లేదా పాస్‌బుక్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ తీసుకుని వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పి.పద్మ తెలిపారు. మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అన్నదాత సుఖీభవ పథకం అర్హులను వెరిఫికేషన్ చేస్తారని చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూమి కలిగి ఉండి సాగుచేసే ప్రతి రైతు ఈ పథకానికి అర్హులన్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయ యాత్ర భూమిగా (వ్యవసాయతర భూములు ఇటుక బట్టీలు చేపల చెరువులు మొదలైనవి) మార్చిన వారు ఈ పథకానికి అనర్హులన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల్లో పెన్షన్ నెలకు రూ.10 వేలకు పైన పొందుతున్న వారు, ఆదాయ పన్ను, జిఎస్టి చెల్లిస్తున్న వారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రొఫెషనల్ డాక్టర్స్, లాయర్స్, ఇంజనీర్స్, ఛార్టర్డ్ అకౌంటెంట్స్ కూడా ఈ పథకానికి అనర్హులని అనర్హులని వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

క్వారీ, క్రషర్ల కాలుష్యంపై బాధిత రైతుల నిరసన

ప్రజాశక్తి - కంచికచర్ల : రాతి క్వారీలు, క్రషర్లు నుండి వచ్చే దుమ్ము, ధూళి కాలుష్యం వల్ల పంట పొలాలు కాపాడాలని బాధిత రైతులు గురువారం క్వారీ క్రషర్లు ఏరియా రహదారి వద్ద ఆందోళన చేపట్టారు. కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో 100కు పైగా రాతి క్వారీలు, క్రషర్లు ఉన్న విషయం తెలిసిందే. ఎన్నో ఏళ్లుగా క్వారీలను లీజుకు దక్కించుకున్న గుత్తేదారులు, వాటికి సమాంతరంగా క్రషర్లు కూడా నడుపుతున్నారు. క్వారీ లీజు దారులు, క్రషర్లు యజమానులు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారీతిన క్వారీలు క్రషర్లు నడుపుతున్నారు. క్వారీలు, క్రషర్లలో నిబంధనలు పాటించకపోవటం వల్ల తరచూ ప్రమాదాలు జరిగి అమాయక కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇక్కడ క్వారీలు క్రషర్లు నిబంధనలు పాటించకపోవటమే కాదు, కార్మిక చట్టాలు కూడా అమలు కావు. ఇంత అక్రమాలు జరుగుతున్నా, క్వారీలు, క్రషర్లలో నిబంధనలు అమలు చేయించటంలో ప్రభుత్వాలు, ఆయా శాఖల అధికారులు మీనమేషాలు లెక్కిస్తారు. కోర్టులు, పర్యావరణ పరిరక్షణ సమితి, మానవ హక్కుల కమిషన్, ఎన్జీజీ జోక్యం చేసుకున్నా గుత్తేదారుల ధన, రాజకీయ బలానికి ఏమీ చేయలేని పరిస్థితులున్నాయని జనం ఆరోపిస్తున్నారు.

పొలాలు నాశనం : కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో గల రాతి క్వారీలు క్రషర్లు నుండి వచ్చే దుమ్ము ధూళి కాలుష్యం వల్ల వీటి సమీపంలో గల వందలాది ఎకరాలు వ్యవసాయ భూములు సారం కోల్పోతున్నాయి. పంటలు సాగు చేసినప్పుడు, క్వారీ క్రషర్లు నుండి వచ్చే దుమ్ము, ధూళి కాలుష్యం వల్ల పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలు పండక పోవటమే కాదు, భూములు సారం కూడా కోల్పోతున్నాయని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై బాధిత రైతులు కొన్నేళ్లుగా సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు గోడు వెలిబుచ్చినా, రైతుల గోడు పట్టించుకున్న నాధుడు లేడని రైతులు వాపోతున్నారు. ఒకవేళ పొలాలు అమ్ముకోవాలన్నా, క్వారీ క్రషర్లు గుత్తేదారులు పొలాలు అమ్ముకోనీయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇటీవల బాధిత రైతులు నందిగామ ఎంఎల్ఎ తంగీరాల సౌమ్యను కలిసి, పరిటాల పరిధిలో గల రాతి క్వారీలు క్రషర్లు నుండి వచ్చే దుమ్ము ధూళి కాలుష్యం వల్ల పంట పొలాలు జరిగే నష్టాన్ని వివరించి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



పరిటాల క్వారీ క్రషర్లు వద్ద నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

న్యాయం జరిగే వరకూ పోరాటం : రైతులు

బాధిత రైతులు క్వారీ క్రషర్లు ఏరియాలో క్వారీలకు వెళ్ళే రహదారిపై నిరసన తెలిపారు. క్వారీ క్రషర్లకు వెళ్ళే టిప్పర్లను నిలిపి, తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. క్వారీ క్రషర్లు నుండి వచ్చే దుమ్ము ధూళి కాలుష్యం వల్ల పంట పొలాలు కాపాడాలని, ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని, క్వారీ క్రషర్లలో నిబంధనలు, చట్టాలు అమలయ్యేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని బాధిత రైతులు పేర్కొన్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగిన శిక్షణ

తిరువూరు గ్రంథాలయంలో



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులకు గురువారం ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు బొమ్మలు ఎలా గీయాలో నేర్పించారు. మరో ఉపాధ్యాయుడు ప్రసన్నకు మార్ స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పించారు. ఇంగ్లీష్‌లో మాట్లాడటానికి అవసరమయ్యే వెరబ్స్, టెన్‌సెస్ గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. తాను ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను చదువుకుని ఉద్యోగం సాధించానని, మీరు కూడా ఈ సమ్మర్ క్యాంపులో నిర్వహించే కార్యక్రమాలన్నింటినీ ఉపయోగించుకుని క్రమశిక్షణతో మెలగాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు పేపర్ క్రాఫ్ట్‌లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసినట్లు గ్రంథాలయ అధికారి కె.పద్మావతి తెలిపారు. **మైలవరం :** వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం ఎస్‌విఆర్ విజిఎన్ఆర్ జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు తెలుగు భాష, తెలుగు భాష ఏర్పడిన విధానం, గొప్పతనం గురించి వివరించారు. భారతీయ సంస్కృతి వారసత్వ స్వరూపాన్ని దాని వైభవాన్ని విద్యార్థులకు తెలిపారు. మానవ జీవితంపై అపారమైన ప్రభావాన్ని చూపేది సంస్కృతి అని ఒక జాతి విజ్ఞానం, కళలు, విశ్వాసాలు, ఆచారాలు, సాంప్రదాయాలు, నైతిక దృక్పథాలు, విధానం మొదలైన వాటి సమిష్టి సంపద సంస్కృతి అని అన్నారు.

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి ద్వాదశ సేవలు, ద్వాదశ ఆరగింపులు, శ్రీ పుష్పయాగం, పర్యంకాసనోత్సవం (పవళింపు సేవ) కార్యక్రమాలతో ముగిశాయి. శ్రీ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి కె.బాలకృష్ణ అధ్యక్షతన దేవదాయ శాఖతో సమన్వయ సేవలను అందించిన పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, వైద్య శాఖ, అగ్నిమాపక శాఖ, ఆర్.టి.సి, ఆర్ అండ్ బి, మత్స్య శాఖ, ఎక్సైజ్ శాఖల అధికారులకు, వేదాద్రి గ్రామ పంచాయితీ, తదితర ప్రభుత్వ శాఖల అధికారులకు దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణఇందిరా దత్తు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ధన్యవాదాలు తెలిపారు.

పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలి: సిఐటియు

ప్రజాశక్తి - విజయవాడ : న్యాయబద్ధమైన మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనట్లయితే కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాల్సి వస్తోందని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర కమిషనర్ ధ్యానచంద్రకు నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్, వాటర్, పార్కులు, వెహికల్ డిపో మెకానికులు, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్, డీప్ స్టేషన్స్, ఎస్టిపి, వాటర్ సెక్షన్లలో మూడు షిఫ్ట్ విధానాన్ని అమలు పరచాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె వంటి వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. 60 సంవత్సరాల నిండాయని పారిశుధ్యం పనిలో నుంచి నిలుపుదల చేసిన సంబందిత కార్మికుల కుటుంబంల్లో పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాశీనాథ్, తదితరులు

వెహికల్ డిపో, ఆర్వో ప్లాంట్, టు వీలర్ షెడ్యూల్ డ్రైవర్‌కు బూట్లు, ఇవ్వాలని కోరారు.డ్రైనేజీ కార్మికులకు కూడా యూనిఫామ్, చెప్పులు, సబ్బులు ఇవ్వాలన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు నేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబాస్, యూనియన్ నాయకులు ముద్ర బోయిన నరసింహారావు, బత్తుల రవి, గుర్రం కరిముల్లా, వెంకటప్ప, నాగబాబు, దుర్గారావు, నారాయణ, సైదులు, చిన్న, వెంకట్రావు పాల్గొన్నారు.

చిలుకూరు గ్రామ పార్టీ అధ్యక్షునిగా సుబ్బారావు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : చిలుకూరు టిడిపి అధ్యక్షులుగా గాటేపల్లి సుబ్బారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య కార్యాలయంలో కలిశారు. సుబ్బారావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



'వెండి పాత్ర సమర్పణ'

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరుల సేవలో వినియోగించడానికి గానూ నిమిత్తం పూర్వ కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీ కాంతం 2 కిలోల 28 గ్రాముల వెండి 5 గిన్నెల నివేదన పాత్రను గురువారం దేవస్థానానికి విచ్చేసి వెండి పాత్ర అందించారు. ఈ సందర్భంగా దాత, కుటుంబీకులకు అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, చిత్రపటం, ప్రసాదాలను దేవస్థానం నుండి అందించారు.

పెనుగంచిప్రోలు గ్రామ వైసిపి అధ్యక్షునిగా శంకర్

ప్రజాశక్తి - వత్సవాయి : వైసిపి మండల అధ్యక్షునిగా గుడిమెట్ల శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం వైసిపి మండల అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.



ఏడు నియోజకవర్గాలకు తాగునీరు

- నీటి సమస్యను అధిగమించేందుకు పైప్‌లైన్ నిర్మాణం
- అభివృద్ధి పనులకు మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు

ప్రజాశక్తి-గూడూరు: జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి తాగునీరు అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.గురువారం ఆయన తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఆకుమర్రు సమగ్ర రక్షిత నీటి సరఫరా అభివద్ధి పనులు యస్.యస్ ఫిల్టర్స్ మరమ్మతుల శంఖుస్థాపన కార్యక్రమములో పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్నం పరిసర ప్రాంతంలోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు నాడు దాదాపు 200 ఎకరాల్లో తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేశారని, నాటి నుంచి టిడిపి అధికారంలో ఉన్న సమయంలో వాటి నిర్వహణ బాధ్యతలను చేపడుతూ వస్తోందన్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వ హాయంలో పాత వాటి స్థానంలో నాణ్యమైన పైపులైన్లను నిర్మించిన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. నేడు రూ.2.40 కోట్ల వ్యయంతో ఆకుమర్రు సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకానికి నాలుగు ఫిల్టర్ బెడ్ల మరమ్మతులు, ఇతర అభివద్ధి పనులకు నిధులను వెచ్చిస్తున్నామన్నారు. ఈ స్కీము ద్వారా మచిలీపట్నం మండలంతోపాటు పెడన నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు దాదాపు 55 వేల మంది జనాభాకు ప్రతిరోజు తాగునీటిని అందించడం జరుగుతుందన్నారు.అదేవిధంగా జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు కలిపి దాదాపు రూ.2 వేల కోట్ల జల్ జీవన్ మిషన్ కేంద్ర ప్రభుత్వ నిధులు అందుబాటులో ఉన్నాయని, వీటికి రాష్ట్ర ప్రభుత్వ నిధులను జోడించి విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద నుంచి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు పైప్ లైన్ నిర్మాణం చేపట్టి పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), కూటమి నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య), స్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గోవు సత్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నటరాజన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



డోకిపర్రులో మంత్రి పర్యటన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ పరిధిలోగల రైతు సేవా కేంద్రం వద్ద గ్రామంలోని పశువులు ఉన్న రైతులకు పశువుల దాన సబ్సిడీపై సరఫరా చేశారు. గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పశు సంవర్ధక శాఖ అధికారి ఏడి డాక్టర్ సాంబశివరావు చేతుల మీదుగా దాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, డాక్టర్ నాగార్జున, రైతు భరోసా కేంద్రం ఇంచార్జ్ శైలజ, ల్యాబ్ అసిస్టెంట్ డేవిడ్, మండలి శేషు పాల్గొన్నారు.



సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 15 వ తేదీ నుండి జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు యాత్రికుల సౌకర్యార్థం గన్నవరం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపబడుందని డిపో మేనేజర్ తెలిపారు. ఈ బస్సు వరంగల్ భద్రకాళి దేవాలయం, వేములవాడ రాజరాజేశ్వరి దేవాలయం, కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం, ధర్మపురి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం, కాళేశ్వరం మహా కాళేశ్వర ఆలయం దర్శించుకొని పుష్కర స్నానం తరువాత రామప్ప దేవాలయం దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. బస్సు 21వ తేదీ బుధవారం సాయంత్రం గన్నవరంలో బయలుదేరి 24వ తేదీ శనివారం తిరిగి గన్నవరం చేరుకుంటుందని తెలిపారు. ను. కావున భక్తులు ఈ సదావకాశమును వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7382905633, 8790996090 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

బొబ్బా శ్రీనివాసరావుకు నివాళి

ప్రజాశక్తి-గన్నవరం: మంచి పనులు చేయడం ద్వారా సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన బొబ్బా శ్రీనివాసరావు చిరస్మరణీయులని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ రావు, గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్తనరావు అన్నారు. గురువారం గన్నవరం రాయ నగర్ కళ్యాణ మండపంలో ది గూడవల్లి వెంకటసుబ్బయ్య గన్నవరం ఎంప్లాయిస్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బా శ్రీనివాసరావు సంస్మరణ కార్యక్రమం జరిగింది. పలువురు ప్రముఖులు, విద్యావంతులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజల్లు బొబ్బా చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ డి. ఈ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో గద్దె, దాసరి మాట్లాడుతూ.. ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజ్, బుద్ధవరం వికేఆర్ కళాశాలలో సుదీర్ఘ కాలం పాటు అధ్యాపకుడుగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత శ్రీనుకే దక్కిందన్నారు. గన్నవరం ప్రాంతంలోని ఉద్యోగులందరినీ సంఘటితం చేసి కల్చరల్ అసోసియేషన్ ఏర్పాటు చేయడంలోనూ ఆయన కీలకపాత్ర పోషించినట్లు చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేశారని ఆయన లేని లోటు తీరనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ ఆర్ కే ప్రసాద్, మన్నే సుందర రావు, ఎం వి ఎల్ ప్రసాద్, కడియాల హనుమంతరావు, రాజేశ్వరి, కష్ణ ప్రసాద్, పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.





విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రేడ్-2 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు బుక్ బ్యాలెన్స్ ఆటలను ఆడించారు. కాగితంతో పువ్వులు తయారు చేయుట నేర్పించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. సృజనాత్మక కార్యక్రమంలో భాగంగా పేపర్‌తో గులాబీ పువ్వులు తయారు చేయుట నేర్పించినట్లు గ్రంథాలయ అధికారిని టి.వాణి తెలిపారు.

ఎఎంసి చైర్మన్‌కు అభినందన

ప్రజాశక్తి-అవనిగడ్డ: దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావుకు ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అభినందనలు తెలిపారు. గురువారం సురేష్‌బాబు వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితుల్లో సైతం ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ వాటిపై నిర్భయంగా పోరాడే తత్వంతో వెంకటేశ్వరరావు ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కైతేపల్లి రాజేష్, జి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-పామర్రు: కార్యకర్తలకు టిడిపి అధినాయకత్వం అన్నివేళల అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధి కురుమద్దాలిలో ఇటీవల మరణించిన మిన్నుకూరి మేరీ అనే పార్టీ కార్యకర్త కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కుమార్ రాజా గురువారం తన కార్యాలయంలో5 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ముందు చూపుతో పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడం వల్ల ఆపద సమయంలో వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొసరాజు వెంకటేశ్వరరావు, పరసా సుబ్రహ్మణ్యం,మంతెన రామాంజనేయులు,వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల నమోదు పరిశీలన

ప్రజాశక్తి-పామర్రు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఏ ఆటంకం లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం పామర్రు పంచాయతీ కార్యాలయంలో రేషన్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేషన్ కార్డుల పంపిణీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని అన్నారు.గత కొన్ని రోజులుగా పామర్రు లోకార్డుల నమోదు ప్రక్రియ కొనసాగటం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయి అన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియకు సర్వర్లు పనిచేయడం లేదని కార్యాలయ సిబ్బంది ఆయన దష్టికి తీసుకువచ్చారు. సాంకేతిక సమస్యలను అధిగమించి ప్రత్యన్మయ మార్గం ఆలోచించి క్షేత్రస్థాయిలో పనులు జరిగే విధంగా అధికారులు పనులు చేయాలని ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగాప్రజలను ఇబ్బంది పెట్టకూడదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే.జ్యోతి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, పామర్రు టిడిపి అధ్యక్షుడు పరసా సుబ్రహ్మణ్యం, పంచాయతీ సభ్యుడు మంతెన రామాంజనేయులు, సీనియర్ టిడిపి నాయకులు వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డుల నమోదును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వర్ల

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-పామర్రు:అనారోగ్య స్థితిలో ఉన్నపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవటానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడు తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో గురువారం 24 మంది బాధితులకు 19 లక్షల 30 వేల 667 రూపాయల విలువైన చెక్కులను బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పామర్రు నియోజకవర్గంలో ఇప్పటివరకు పది సార్లుగా కోటి 70 లక్షల రూపాయలను బాధితులకు సహాయంగా అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు టిడిపి అధ్యక్షుడు పరసా సుబ్రహ్మణ్యం, పంచాయతీ సభ్యుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో ఉపాధి కార్మికులు పాల్గొనాలి



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం: గత శతాబ్ది కాలంగా కార్మిక వర్గం సాధించుకున్న, కార్మిక అనుకూల చట్టాలన్నీ రద్దుచేసి, నాలుగు కార్మిక కోడ్లు ప్రవేశపెట్టి వాటిని నిర్బంధంగా అమలు జరపాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అల్లాపురం గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 20వ తేదీన జరిగే కార్మికుల సమ్మెలో ఉపాధి కూలీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడు చట్టాల రద్దు కోసం ఢిల్లీలో జరిగిన పోరాటంలో కార్మిక వర్గం మనకు మద్దతు ఇచ్చిందన్నారు. నేడు పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు రెండింటిని కార్పొరేట్ కంపెనీల హస్తగతం చేయచూస్తుందన్నారు. దేశంలోని అన్ని ట్రేడ్ యూనియన్లు ఈ నెల 20న కార్మిక సమ్మెకు పిలుపునిచ్చాయని, అదే రోజు గన్నవరం మండలంలో రైతులను, కౌలు రైతులను సమీకరించి ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. కౌలు దారుల సంఘం నాయకులు మండల ఏసుదాసు మాట్లాడుతూ... విద్యుత్తు స్మార్ట్ మీటర్లు ఉప సంహరించాలన్నారు. నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయాలని,ఆక్వా, సాల్ట్(ఉప్పు) రైతులను ఆదుకోవాలన్నారు. చెరకు కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి నుండి కేటాయించి, మినుములు క్వింటా 9వేల రూపాయలకు కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పాల రైతులకు లీటరుకు 10 రూపాయలు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. జిల్లాలో ఉన్న వేలాది ఎకరాల చుక్కల భూములు 22ఎలో పెట్టిన నిషేధ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేయాలని విన్నవిం చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కళ్లం రాంబాబు, మిరప నాగేశ్వరరావు, ఆంతోని తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - వీరులపాడు : 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ కార్మికులకు పిలుపునిచ్చారు. వీరులపాడులో ఉపాధి కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం ప్రభాకర్, గూడెల్లి పుల్లయ్య పాపారావు, జయరాజు, కృష్ణ, ఉపాధి హామీ మెట్లు కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నందిగామ : 20న దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణరంగ కార్మికులందరూ పని బంద్ చేసి సమ్మెలో పాల్గొనాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నందిగామలో భవన నిర్మాణ కార్మికులు సమ్మె కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ పటాన్ మేస్త్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సయ్యద్ ఖాసిమ్, వెంకటేశ్వర్లు, స్వామి, మైనర్ బాబు, వళి, పాల శ్రీను. కార్మికులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ వెస్ట్ ఇబ్రహీంపట్నం భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి సమ్మె ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సభ్యులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ : కాళేశ్వర మార్కెట్ సెంటర్‌లో 37వ డివిజన్ కార్మికుల సమావేశంలో సిఐటియు


వీరులపాడులో ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న కళ్యాణ్

మున్సిపల్ యూనియన్ సర్కిల్ వన్ గౌరవ అధ్యక్షులు, కార్పొరేటర్ బి.సత్యబాబు, యూనియన్ నాయకులు వి.సాంబశివరావు మాట్లాడారు. 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని విజయవాడ నగరంలో జరుగుతున్న భారీ ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇ.కొండ, మహేష్, రాంబాబు, రవణమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

మైలవరం : భవననిర్మాణ కార్మికులందరూ ఐక్యంగా పాల్గొని ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మాదు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం మైలవరంలోని పలు సెంటర్లలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు కొండేటి తిరుపతిరావు, ఎం.తిరుపతిరావు, కార్మికులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె నోటీసును


ఇబ్రహీంపట్నంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం


వన్‌టౌన్‌లో కార్మికులతో మాట్లాడుతున్న సత్యబాబు


మైలవరంలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

పంచాయతీ కార్యదర్శి రఫీకి అందజేశారు. సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సి హెచ్.సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎర్రంశెట్టి వీరమ్మ, చందర్రావు, శివ తదితరులు పాల్గొన్నారు.



పెట్రోలు బంకు తనిఖీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో వేణుగోపాల ఫీలింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్), 2 అంగన్వాడీ సెంటర్ల 127, 128 లను, 40 వేల లీటర్ల, 20వేల లీటర్ల నీటి సామర్థ్యం గల 2 మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను, 2 రేషన్ షాపులు నెం.08, 27లను, వెంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్ట్ (ఆర్.ఓ. ప్లాంట్) కూడా రెడ్డిగూడెం తహశీల్దార్ జె.సుశీలా దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పిడియస్ డిప్యూటీ తహశీల్దార్ శివ నాగరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, పంచాయితీ సెక్రటరీ లక్ష్మణ్, విఆర్ఒ లావణ్య, డిఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డ్రాయింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. గురువారం సర్ ఆర్థర్ కాటన్ 222వ జయంతి, అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి నదిపై ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించాడని, ఆనకట్ట నిర్మించడం వల్ల తూర్పుగోదావరి పశ్చిమగోదావరి జిల్లాలకు సాగు తాగునీరు సమస్య తీరిందని, ఉభయగోదావరి జిల్లాలో సస్యశ్యామలం ఉండటానికి కారణం సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వర్ బ్యారేజీ నిర్మించడమే కారణమని కంచికచర్ల జిల్లా పరిషత్ హై స్కూల్ తెలుగు మాస్టర్ ఎస్‌కె ఇస్మాయిల్ తెలిపారు. అంతర్జాతీయ కుటుంబ దినోత్సవ సందర్భంగా ఉమ్మడి కుటుంబాల ఆప్యాయతలు అనురాగాల గురించి తెలిపారు. డ్రాయింగ్ మాస్టారు నీలం సర్వేశ్వరరావు సీతాకోకచిలుక బొమ్మను గీసి విద్యార్థులకు నేర్పించారు. క్రాఫ్ట్ మాస్టర్ ఎం.కనకారావు క్రాఫ్ట్ వర్క్ చేయించారు. విద్యార్థులచే పుస్తక పఠనం చేయించి అనంతరం, చదరంగం ఆడించారు. గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

బిబిఎకు జగ్గయ్యపేట బార్ మద్దతు

ప్రజాశక్తి జగ్గయ్యపేట: బెజవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ కె భాష నేత్రుత్వంలోని న్యాయవాదుల బందం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ను మర్యాద పూర్వకంగా కలిసి న్యాయవాదుల సంక్షేమం, భద్రత కొరకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా వినతిపత్రం సమర్పించారు. ఇందుకు మద్దతుగా గురువారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ హాల్ లో జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుందర్ రావు మాట్లాడుతూ అనేక సవాళ్ళతో కూడిన న్యాయవాద వత్తిలో న్యాయవాదులు భద్రతను కోల్పోతున్నారని, అలాగే జూనియర్లు జీవనోపాధి కొరకు తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఇటువంటి సమయంలో బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదుల చర్యలు న్యాయవాద వత్తికి మేలు చేసేవిగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్యామల నరసింహ రెడ్డి, చావా రవి, రాయపూడి శ్రీనివాసరావు, వి. మధు, వై రాజేంద్ర ప్రసాద్, జి శ్రీనివాస గౌడ్, ఏం వీరాంజనేయులు, రావూరి ప్రసాద్, ఎ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూముల బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని జగ్గయ్యపేట పట్టణంలో గల శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానానికి చెందిన దేవస్థానం సంపూర్ణ అనుభవ హక్కులో గల తిరుమలగిరి, జగ్గయ్యపేట, షేర్ మహమ్మద్ పేట గ్రామాలకు చెందిన 209.08 సెంట్లకు గురువారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహించారు. తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం యొక్క కొండ కింద గల సత్రంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో దేవస్థానానికి లోగడ గల పాట కంటే 1,70,000 అదనపు ఆదాయం చేకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలను గురువారం దేవదాయ శాఖ నందిగామ డివిజన్ తనిఖీదారు సమక్షంలో లెక్కించారు. స్వామివారి దేవస్థానం సంబంధించిన హుండీల ద్వారా రూ. 26,41,390లు, శివాలయం హుండీ ద్వారా రూ.28,104 అన్నదానం హుండీ ద్వారా రూ.29,996లు ఆదాయం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ కన్నెవీడు సిబ్బంది, పరిటాల సేవాసమితి వారు పాల్గొన్నారని ఆలయ కార్య నిర్వహణ అధికారి తెలిపారు.


రీ సర్వేను పరిశీలిస్తున్న రెవెన్యూ డివిజనల్ అధికారి బాలకృష్ణ, తదితరులు

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : భూముల రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి కె.బాలకృష్ణ అన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని ము చ్చింతల గ్రామం లో జరుగు తున్న భూముల రీ సర్వేను ఆయన పరిశీలిం చారు సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ దగ్గరుండి సర్వే చేయించు కోవాలని తప్పులు తడకలు ఏమైనా చేర్పులు మార్పులు ఉంటే సరి చేయించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేర్ వెంకటస్వామి మండల సర్వేయర్లు డిప్యూటీ తాసిల్దార్ విలేజ్ సర్వేయర్లు వీఆర్వోలు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని గర్భిణీ మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : టిప్పర్ ఢీకొనడంతో నిండు గర్భిణి మృతిచెందిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలంపల్లి గ్రామానికి చెందిన రంగా రాజేశ్వరి (22) ఆమె మావయ్య కూరగాయల రంగా రమేష్‌తో కలిసి గురువారం వత్సవాయిలోని బ్యాంకుకు బైక్‌పై వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి సమీపంలోకి వచ్చేసరికి టిప్పర్ లారీ వెనుక నుంచి ప్రమాదవశాత్తు బైకును ఢీకొంది. ఈ ఘటనలో రాజేశ్వరి తన చేతిలో ఉన్న రెండేళ్ల బాబు రేవంత్‌ను దూరంగా విసరడంతో బాబు ప్రమాదం నుంచి బయట పడ్డాడు. రోడ్డుపై పడిపోయిన రాజేశ్వరి తల మీద టిప్పర్ వెనక టైర్లు ఎక్కడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. మృతురాలు ఏడు నెలల గర్భిణీ అని భర్త రంగా సతీష్ తెలిపారు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకున్నారు. నిండు గర్భిణి మృతితో పోలంపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బస్సును ఢీకొన్న లారీ

అధిక వేగంతో వెళ్తున్న లారీ బస్సును ఢీకొనటంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయిన సంఘటన మండలంలోని భీమవరం గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు సమాచారం మేరకు వైజాగ్ విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎన్ఎస్‌పి కాలువ దాటిన తర్వాత సాయిబాబా గుడి సమీపానికి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఓవర్ స్పీడ్‌లో బస్సుకు తగలడంతో బస్సు ముందు భాగం నువ్వు నుజ్జయింది. దాంట్లో ప్రయాణికులు 41 మందికి పైగా ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. వత్సవాయి ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు పలహారాలు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : టిడిపి సీనియర్ నాయకులు ఉన్నం నరసింహారావు పుట్టినరోజు సందర్భంగా టిడిపి నాయకులు నందిగామ ఏరియా హాస్పిటల్ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పేషెంట్లకు ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయంగా ఆలోచించాలి

ప్రజాశక్తి - తిరువూరు : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని, ఏ విషయాన్నైనా గుడ్డిగా నమ్మకుండా, శాస్త్రీయంగా ఆలోచించాలని విశ్రాంత ఉపాధ్యాయురాలు ఎం.కమలమ్మ విద్యార్థులకు చూపించారు. జెవివి ఆధ్వర్యంలో తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 20 రోజుల నుండి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచనపై గురువారం అవగాహన కల్పించారు. దేనిని గుడ్డిగా నమ్మకుండా దాన్ని పరిశీలించి, దానిలోని వాస్తవ అవాస్తవాలను గమనించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ వేసవి సెలవుల్లో మొబైల్ ఫోన్స్, టీవీలకు బానిసలు కాకుండా ఇలాంటి వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని మరో ఉపాధ్యాయిని టి.ఆరోగ్యం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు ఎల్.గంగాధర్, ఎం.హరికృష్ణ, ఎం.సుధాకర్, డి.సుదర్శన్, కె.పాపారావు, ఎం.రాంప్రదీప్, ఎం.జగన్మోహన్‌రావు, ఎస్.డి.సుదర్శన్, సమతా కన్వీనర్ ఎస్.ఉషారాణి విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమలమ్మ

దేవరపల్లిలో మట్టి అక్రమ తవ్వకాలు


మట్టిను తవ్వుతున్న ప్రొక్లెయినర్, ఇన్‌సెట్‌లో మట్టి లారీలను అడ్డుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మండలంలోని దేవరపల్లి గ్రామ లంక ప్రాంతమైన రాజీవ్ గడ్డలో రెండు రోజులుగా అక్రమ మట్టి తోలకాలను అక్రమార్కులు విచ్చలవిడిగా సాగిస్తున్నారు. అడ్డు అదుపు లేకుండా దొరికిన కాడికి దోచుకునే విధంగా అక్రమార్కులు మట్టి తవ్వకాలకు తెర లేపారు. ఏ విధమైన అనుమతులు లేకుండా పెద్దపెద్ద మిషన్లతో లారీలలో మట్టిని తరలించుకుపోతున్నారు. గ్రామస్తులు, రైతులు ఇదేమని ప్రశ్నించడానికి ముందుకు వస్తే వారి పైన అక్రమ కేసుల బనాయిస్తున్నారని భయపడి మీడియాకు సమాచారం ఇచ్చారు. కృష్ణానది ఒడ్డున దేవరపల్లి గ్రామ పరిధిలోని రాజీవ్ గడ్డ లో రహదారిని ఆనుకుని ఉన్న పొలంలో అక్రమార్కులు మట్టి తవ్వకానికి తెర లేపారు. దేవరపల్లి, కళ్ళం వారి పాలెం, పొట్టిదిబ్బలంక, గుంటూరు జిల్లాలోని కొల్లిపర గ్రామానికి ఇదే ప్రధానం రహదారి. ఈ తవ్వకాలు వల్ల కష్ణా నదికి వరద వచ్చినప్పుడు ఈ మార్గం కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. గత రెండు రోజులుగా ఈ రహదారి వెంట ఉన్న పొలంలో అక్రమంగా లారీలతో మట్టి తోలుకుపోతున్నారు. మట్టి తోలకందారులను మీడియా ప్రశ్నించగా గన్నవరం లోని ఓ నాయకుడు తమను పంపించాడని పర్మిషన్ల గురించి తమకేమీ తెలియదని అన్నారు. వాల్టా చట్టం ప్రకారం మోటార్ బోర్లకు 500 మీటర్ల దూరం వరకు ఎటువంటి తవ్వకాలు జరపకూడదు. కానీ ఇక్కడ అక్రమార్కులు అక్రమ సంపాదన ద్యేయంగా పొలంలోని మోటారు చుట్టూ రెండు మీటర్ల లోతు వరకు మిషన్లతో తొవ్వేస్తున్నారు.పొలంలో ఉన్న మోటార్ బోరు ప్లాస్టిక్ పైపు రెండు మీటర్ల వరకు పైకి వచ్చింది. ఈ విషయంపై తహసిల్దార్ కుసుమ కుమారిని వివరణ అడగగా. మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని ఎవరికీ ఇవ్వలేదని తెలిపారు. అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి బి నాగేశ్వరరావు అక్రమ మట్టి తవ్వకాల ప్రాంతానికి చేరుకుని లారీలకు తన ద్విచక్ర వాహనాన్ని అడ్డుపెట్టి తరలింపును నిలువరించారని చెప్పారు.

పందుల నియంత్రణకు చర్యలు

ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న గీతాంజలి శర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పట్టణాల పరిధిలో పందుల నుండి ప్రజలకు ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో పందుల వలన కలిగే ముప్పు నివారణ పై సంబంధిత అధికారులు, పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లాలో పందుల వలన ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పందుల పెంపకందారులు పందులను పట్టణాల్లో ఎక్కడపడితే అక్కడ పెంచకుండా వీధుల్లో తిరగకుండా ఊరికి దూరంగా ఒక నిర్దిష్టమైన ప్రదేశంలో పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. ఒక సంఘంగా ఏర్పడితే వారికి ప్రభుత్వం తరఫున స్థలం గుర్తించి లీజుకు గాని, అమ్మకానికి గాని ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పందుల పెంపకందారు కందుల శీను మాట్లాడుతూ మచిలీపట్నంలో 50 మంది దాకా పందుల పెంపకందారులు ఉన్నారని, తమకు స్థలం ఇస్తామన్నారు కానీ ఇంకా ఇవ్వలేదని, కరోనా వచ్చిన తర్వాత చాలా పందులు వ్యాక్సిన్ వేసినప్పటికీ చనిపోతున్నాయని చెప్పారు. ఈ విషయమై జిల్లా పశు సంవర్ధక అధికారి చిన్న నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో ఇది వరకు 3,650 పందులు ఉండేవని, ప్రస్తుతం 2,500కు తగ్గిపోయాయన్నారు. తమ శాఖ వద్ద స్వైన్ ఫ్లూ టీకాలు (వ్యాక్సినేషన్లు) అందుబాటులో ఉన్నాయని, వాటిని పందులకు క్రమం తప్పకుండా వేస్తున్నామన్నారు. పందులు కలుషిత ఆహారం, రసాయనిక ఆహారం తినడం మూలాన సుస్థిరత్వం కోల్పోయి చనిపోవడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వివి నాయుడు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, పెడన, తాడిగడప మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహర్, వెంకటేశ్వరరావు, గోపాలరావు, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి : కొల్లు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా విశ్వవిద్యాలయంలో ఫార్మసీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించడం అద్భుతమని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రశంసించారు. గురువారం డా బిఆర్ అంబేద్కర్ అకడమిక్ బ్లాక్‌లోని రవీంద్రనాథ్ ఠాగూర్ సమావేశపు మందిరంలో మొదటిసారి ఏర్పాటు చేసిన అచివర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వవిద్యాలయంలో చదువును పూర్తి చేసుకుని ప్రాంగణ ఎంపికల ద్వారా వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన యువతకు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి ఉద్యోగ నియామక పత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్లె తుమ్మలపాలెం గ్రామంలో మెగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, దీని ద్వారా పెద్ద మొత్తంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. త్వరలోనే మచిలీపట్నం పోర్టు నిర్మాణం పూర్తికానుందని, ఈ నేపథ్యంలో పోర్టు ఆధారిత పరిశ్రమలు వస్తాయని, యువత ఇతర నైపుణ్యాలు అభివద్ధి చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ప్రపంచంలో అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారతదేశమని, యువత వినూత్నంగా ఆలోచిస్తే అద్భుతాలు సష్టిస్తారని, ఆ దిశగా



విద్యార్థినికి నియామక పత్రం అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

యువత కషి చేసి అభివద్ధి చెందాలని సూచించారు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, సంవత్సరాలు తరబడి ఒకే ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదని, ఇతర ఉద్యోగ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ మాట్లాడుతూ కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఏడాదికి తొమ్మిది లక్షల రూపాయలు ప్యాకేజీతో ఎంపిక అవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దమొత్తంలో ప్యాకేజ్ ద్వారా ఉద్యోగం పొందిన విద్యార్థులను మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సత్కరించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థుల తల్లితండ్రులకు సత్కారం చేసి వారి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొనకళ్ల జగన్నాధరావు (బుల్లయ్య), నెక్స్ట్ హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సిఈఓ సాయికృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.


పారిశ్రామికవాడలో పరిశ్రమను పరిశీలిస్తున్న యార్లగడ్డ

పారిశ్రామికవాడలో వసతుల కల్పనకు కృషి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: మండల పరిధిలోని మల్లవల్లి గ్రామంలో లోని మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో మౌలిక వస్తువులు కల్పనకు చిత్తశుద్ధితో కషి చేస్తున్నట్లు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బుధవారం రాత్రి పారిశ్రామిక వాడలోని హరిత ట్రాన్స్ఫార్మర్ ను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ఫార్మర్లు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన యార్లగడ్డ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులు గొట్టుముక్కల రవికుమార్ మాట్లాడుతూ ఈ పారిశ్రామికవాడలో విద్యుత్ అవాంతరాలను నివారించటానికి 220 కే.వి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం అత్యవసరమని, గతంలో సబ్ స్టేషన్ మంజూరైనప్పటికీ ఏపీఐఐసీ భూమిని కేటాయించకపోవడంతో నిర్మాణం ఆగిపోయిందని ఎమ్మెల్యేకు వివరించారు. పారిశ్రామిక వాడ పక్క నుంచి విద్యుత్తు లైన్ ఉన్నందున ప్రభుత్వానికి ఖర్చు తక్కువ అవుతుందని కేవలం ఐదు ఎకరాలు భూమి కేటాయిస్తే సబ్ స్టేషన్ నిర్మించుకోవడానికి వీలవుతుందని తెలిపారు. ప్రస్తుతం 4 వేల మంది కార్మికులు ఈ పారిశ్రామిక వాడలో పనిచేస్తున్నప్పటికీ సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇంత పెద్ద పారిశ్రామిక వాడలో ఏపీఐఐసీ పరిపాలన భవనాన్ని కూడా నిర్మించకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా ఇక్కడ పోలీస్ అవుట్ పోస్ట్, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, నీటి కొరత లేకుండా చూడాలని కోరారు. వీరి సమస్యలను సావధానంగా విన్న యార్లగడ్డ ఈ సమస్యలన్నిటి పరిష్కారానికి పాటుపడతానని అవసరమైతే అసోసియేషన్ ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి మురళీధర్, కార్యదర్శి ఫణీంద్ర కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్ అమలు చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ఉద్యోగోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ను పారదర్శకంగా అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిబాబు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. జీవో నెంబర్ 5 ప్రకారం అన్ని డిపార్ట్మెంట్లలోని అన్ని క్యాడర్లలో ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్ వర్తింపజేసి ఎస్సీ, ఎస్టీలకు తగినంత ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996లోని 22వ నిబంధన అనుసరించి పారదర్శకంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ను అమలు చేయాలని ,త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ప్రతి జిల్లాలోనూ కేడర్ వారీగా ప్రస్తుతం పని చేయుచున్న ఎస్సీ, ఎస్టి ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారో తెలియజేసి, కొత్తగా ఇవ్వనున్న ఉద్యోగోన్నతుల్లో ఎన్ని పోస్టులు ఆయా వర్గాలకు కేటాయింపబడుతున్నాయో, తగిన ప్రాతినిధ్యంకు చేరాలంటే ఎన్ని పదోన్నతులు ఇవ్వవలసి ఉందో తదితర వివరాలన్నీ స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ విషయాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దష్టికి తీసుకువెళ్లామని కచ్చితంగా పదోన్నతుల్లో రిజర్వేషన్ను పారదర్శకంగా అమలు చేస్తామని హామీ ఇచ్చి ఈ విషయంలో ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే తమ దష్టికి తీసుకురావాలని కమిషనర్ తెలియజేశారని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ కొండలరావు

ఆర్థిక నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆర్థిక నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట సిఐ కొండలరావు పిలుపునిచ్చారు. కొత్త చట్టాలు వాటిపై అవగాహన కల్పించడానికి గురువారం రాత్రి పోతిన చిన్నా నగర్‌లో విఘ్నేష్ హైట్స్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో కొత్త చట్టాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడకుండా తప్పించుకొనే జాగ్రత్తల గురించి క్షుణ్ణంగా వివరించారు. 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ని ఏయే సందర్భాల్లో ఎలా ఉపయోగించాలో సిఐ అవగాహన కల్పించారు. అన్ని వేళల్లో తాము అందరికీ అందుబాటులో ఉంటామన్నారు. ని, శాంతి భద్రతల సంరక్షణ కోసం ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని సిఐ కొండలరావు కోరారు. సాయి అమరావతి హైట్స్, విఘ్నేష్ హైట్స్, అస్త్ర అపార్ట్‌మెంట్ వాసులు వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తపేట ఎస్ఐ హరి ప్రసాద్, ప్రముఖ న్యాయవాది, ఎఐఎస్ ఆర్‌పి అధ్యక్షుడు, ఎమ్‌వివిఆర్. సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ మారిన చట్టాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని సత్యనారాయణ అన్నారు. మూడు అపార్ట్‌మెంట్స్ ప్రతినిధులు విమల, వై.వి.రమణ, వి.సూర్య ప్రకాశరావు, ఎఐఎస్ ఆర్ పి కార్యదర్శి వంకాయల శ్రీనివాసరావు, ఏ ఓ ఎస్ ఆర్ పి ఉపాధ్యక్షుడు పరుచూరి యోగానంద్ పాల్గొన్నారు.



రైల్వే రిటైర్డ్ ఉద్యోగికి నివాళి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి రామకృష్ణ నగర్ రేణుక అపార్ట్‌మెంట్లలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి చిన్న ఆంజనేయులు అనారోగ్యంతో గత రాత్రి మృతి చెందారు. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లా తాడేపల్లి కాగా, గ్రామంలో యువకుడిగా ఉన్నప్పుడు నుండి డివైఎఫ్ఐ అనేక కార్యక్రమాల్లో, రజక వృత్తిదారులకు సంఘంలో చురుగ్గా పాల్గొనేవారు. అనంతరం ఉద్యోగ బాధ్యతలు రీత్యా రైల్వేలో పని చేస్తూ రిటైర్ అయ్యారు. తాను చివరి వరకు సిపిఎం సానుభూతి పరుడుగా ఉంటానని తాను మరణించిన తరువాత సిపిఎం జెండా తన దేహంపై ఉంచాలని తన చివరి కోరికగా కుటుంబ సభ్యులు తెలియజేయడంతో సిపిఎం తాడేపల్లి సీనియర్ నాయకులు డి.వెంకట్ రెడ్డి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన భౌతికకాయంపై సిపిఎం జెండాను కప్పి, నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సిపిఎం మండల కార్యదర్శి ఎం మహేష్, విజయవాడ రూరల్ గొల్లపూడి మండల కార్యదర్శి టి నరసింహారావు, గుంటుపల్లి సిపిఎం శాఖ కార్యదర్శి ఆరు మల్లికార్జునరావు, ఏపి రజక వృత్తిదారుల రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, కోశాధికారి బొజ్జ సుబ్బారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

31న హరిచరణ్ సంగీత విభావరి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మండు వేసవిలో విజయవాడకు చిరు చిరు చిరు చినుకై కురిసావే అంటూ విజయవాడ, గుంటూరు ప్రజలను పలకరించేందుకు 31న హరిచరణ్ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు రవి మెలోడీస్ మేనేజింగ్ డైరెక్టర్ రవి కుమార్ మందలి అన్నారు. మంగళగిరి వద్ద సి.కె కన్వెన్షన్‌లో ఈ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం లబ్బీపేటలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంగీత విభావరికి ప్రముఖ ఢీ షో డాన్సర్ అక్సాఖాన్ కూడ తన నృత్యాలతో అలరించనున్నారని తెలిపారు. బుక్ మై షో లో టిక్కెట్లు లభిస్తాయన్నారు. అనంతరం ప్రో వీరా మాట్లాడుతూ రవి మెలోడీస్ టాలెంట్ సింగర్స్‌ను ప్లాట్‌ఫామ్ లాంటిదన్నారు. సంస్థ ఆర్టిస్ట్ మేనేజర్ మహేష్ మంద అక్సా ఖాన్ మాట్లాడుతూ విజయవాడలో 31న ఈవెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం హరి చరణ్, అక్సాఖాన్‌లు గుంటూరు, విజయవాడ అభిమానులతో


మాట్లాడుతున్న రవి కుమార్

కలిసి ఆట, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మినేని ఇన్ ఫ్రా స్ట్రక్చర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, హర్షిత డెవలపర్స్ చైర్మన్ పాండు రంగారావు, రవి మెలోడీస్ డైరెక్టర్లు రమేష్ మందా, రాజేష్ మంద, ఎం.ఐ.టివి.అధినేత పెనుముచ్చు శేఖర్, విజయవాడ గుంటూరు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎపిటిఎస్ కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో 26 జిల్లాల్లో ఎపిటిఎస్ కార్యాలయాలు ప్రారంభిస్తున్నామని చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా గురువారం చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ విజయవాడ కార్యాలయంలో మాట్లాడుతూ 1986లో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ కార్పొరేషన్ ప్రారంభమైందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జూలై 24 నుండి ఏప్రియల్ 2025 వరకు ఈ ప్రొక్యూర్ మెంట్ ప్లాట్ ఫామ్ ద్వారా 55, 486టెండర్లు ప్రచురించబడ్డాయన్నారు. మొత్తం ప్రాజెక్టు విలువ 41 వేల కోట్ల రూపాయలు కంటే ఎక్కువన్నారు. ప్రభుత్వ విభాగాలకు మెరుగైన సేవలు అందించడానికి ఏపీటీఎస్ తన



కార్యకలాపాలు, సాంకేతి సేవలను విస్తరిస్తుందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జులై 2024 నుండి ఏప్రిల్ 2025 వరకు ఏపీటీఎస్ ప్రొక్యూర్ మెంట్ సర్వీస్ ద్వారా 110 కోట్ల రూపాయలకు పైగా కొనుగోలు లావాదేవీలు జరిగాయని, ఏపీటీఎస్ జిల్లా స్థాయికి విస్తరించడం వల్ల డిస్ట్రిక్ట్ లెవెల్ ఐటీ ఎకో సిస్టమను స్ట్రెంగ్తెన్ చేయడానికి, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ప్రొక్యూర్మెంట్ నీ మరింత విస్తరించటానికి, జిల్లా స్థాయిలో ఐటీ గవర్నెన్స్ పటిష్ట పరచడానికి, స్థానిక ఎంటర్‌ప్రెన్యూర్స్, ఐటీ ఆసక్తి గల యువతకు మరింత సులభంగా అందుబాటులో తెచ్చేందుకు ఉపయోగ పడుతుందన్నారు.

డెంగ్యూ నివారణకు చర్యలు

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : దోమల నియంత్రణ ద్వారానే డెంగ్యూ వ్యాధిని అరికట్టగలుగుతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. అధికారులు, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రాణాంతక డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 16 తేదీన జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, నగర పాలక సంస్థ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ అధికారులతో గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ దోమల నియంత్రణ ద్వారానే డెంగ్యూ వ్యాధిని


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అరికట్టగలుగుతామన్నారు. దోమల నివారణ పట్ల ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వి.మోతీబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని పాల్గొన్నారు.

కొండపల్లి బొమ్మల కేంద్ర అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : పర్యాటకులకు మధురానుభూతిని కలిగించేలా కొండపల్లి ఖిల్లా, కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయడంతోపాటు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులకు ఆదేశించారు. కొండపల్లి బొమ్మల తయారీ కాలనీ వద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు, కొండపల్లి ఖిల్లా అభివృద్ధిపై ఆయన గురువారం పర్యాటక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మక కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. కొండపల్లిలో సుమారు 400 సంవత్సరాలకు పైగా రాజస్థాన్‌కు చెందిన హస్త కళాకారులు అత్యంత కళానైపుణ్యంతో తయారు చేసిన బొమ్మలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. కొండపల్లి పరిసర ప్రాంతాలలో లభ్యమయ్యే తెల్ల పొణికి చెక్కతో రూపొందించే కొండపల్లి బొమ్మలకు మరింత ప్రాచుర్యం కల్పించి కళాకారులను ప్రోత్సహించడం ద్వారా జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలన్నారు. ఈసమావేశంలో ఏపి టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఎస్.పద్మారాణి, టూరిజం కన్సల్‌టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఏ.శిల్ప, ఏపి టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ డిఇ శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.


సమావేశంలో చర్చిస్తున్న కలెక్టర్



దుర్గమ్మను దర్శించుకున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కనక దుర్గమ్మను హోమ్ మంత్రి వి.అనిత కుటుంబసభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఇఒ వి.కె.శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శనం కల్పించి, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

గెలాక్సీ ప్రీ - ఆర్డర్లు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ విభాగాన్ని నిర్వచించే గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్, సన్నని గెలాక్సీ ఎస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ కోసం ప్రీ-ఆర్డర్‌లను ప్రారంభించిందని సంస్థ ఇన్చార్జి కె.మధు సూదన రావు తెలిపారు. ఎం.జి. రోడ్‌లోని షోరూంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో వివరాలను తెలిపారు. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్, స్థిరమైన టైటానియం బాడీలో ప్రీమియం, ప్రో-లెవల్ పనితీరు యొక్క కొత్త సమతుల్యతను తాకుతుంది అన్నారు.. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ ఎస్ సిరీస్ వారసత్వాన్ని అందిస్తుందని, ఐకానిక్ గెలాక్సీ ఏఐ - ఆధారిత కెమెరాను ఏకీకృతం చేస్తుందన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సుందరయ్య పాఠశాల విద్యార్థులకు అభినందన

విజయవాడ : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించిన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అభినందించారు. సుందరయ్య విద్యార్థులు సుమారు 20 మంది అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. గత 20 ఏళ్లుగా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు హుస్సేన్ ఉచితంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది కూడా ఇచ్చిన శిక్షణతో సైన్స్ 100 కి 100 మార్కులు తెచ్చుకోవడంతోపాటు ముఖ్యంగా ఈ పరీక్షల్లో సాయి అక్షయ అనే విద్యార్థి 104 మార్కులతో 3146 ఉత్తమ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. ఇంకా అనిల్ కుమార్, హర్షవర్ధన్ చంద్రిక భువనేశ్వరి లాంటివారు మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు.

79 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : 2వ, 4వ, 5వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 79 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులను గురువారం ఆరో అడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్‌లో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 79 మందిలో 14 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 65 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.